
సాక్షి విశాఖపట్నం

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



న్యూస్‌రీల్

23 నుంచి బీఎస్సీ ప్రాక్టికల్ ఎగ్జామ్స్

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్రవిశ్వ విద్యాలయం దూరవిద్య కేంద్రంలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్, పర్సనల్ కాంటాక్ట్ తరగతులు, వార్షిక పరీక్షలను ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వర రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాలలో వీటిని నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం బాలుర ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు శ్రీకాకుళం హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో, విశాఖపట్నం బీవీకే కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షలకు హాజరుకావాలన్నారు.

నేటి నుంచి ఎయిర్ కార్గో సేవలు

అల్లిపురం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం నుంచి ఎయిర్ కార్గో సేవలు ప్రారంభిస్తున్నట్లు ఇండిగో విమానయాన సంస్థ తెలిపింది. ఎయిర్ కార్గో కార్గో కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు శుక్రవారం మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఆపరేషన్స్-2, జాయింట్ డైరెక్టర్ అవదేశ్ ప్రతాప్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారని సంస్థ పేర్కొంది. భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి కార్గో కోసం సెక్యూరిటీ క్లియరెన్స్‌కు ఇండిగో సంస్థకు ఇచ్చారని తెలిపారు. తమకు సహకరించిన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డీవీ సుబ్బారావు మెమోరియల్ లెక్చర్

బీచ్‌రోడ్డు : సెంటర్ ఫర్ స్టడీ పాలసీ, విశాఖ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో శనివారం డీవీ సుబ్బారావు మెమోరియల్ లెక్చర్‌ను నొవోటెల్ హోటల్‌లో ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు పాల్గొనున్నారు.

మార్నింగ్ వాక్‌లో ప్రముఖులు



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లక్ష్మీనారాయణ

బీచ్‌రోడ్డు: సాగరతీరంలోని శుక్రవారం మార్నింగ్ వాక్‌లో ప్రముఖులు సందడి చేశారు. మాజీ ఉపరాష్టపతి వెంకయ్యానాయుడు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మార్నింగ్ వాక్ చేస్తూ బీచ్‌లోని వాకర్స్‌ను పలకరించారు. ఈ సందర్భంగా ఇద్దరు కాసేపు ముచ్చటించారు.

ఏయూ లీగల్ కన్సల్టెంట్‌గా సతీష్



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న సతీష్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యాలయం లీగల్ కన్సల్టెంట్‌గా న్యాయవాది సత్యవరపు సతీష్ ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులను అందుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అవసరమైన ఎఫిడివిట్లు తయారు చేయడానికి, విచారణ ఆఫీసర్‌గా, లీగల్ కన్సల్టెంట్‌గా వర్సిటీ కోరిన సందర్భంలో న్యాయపరమైన సూచనలు, సలహాలను సతీష్ అందిస్తారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నిపుణులైన న్యాయవాదులను ఎంపనెల్మెంట్ చేయడం జరుగుతుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంపానల్మెంట్ జాబితాలో లీగల్ కన్సల్టెంట్‌గా సత్యవరపు సతీష్‌ను చేర్చారు. ఈ సందర్భంగా సతీష్‌ను పలువురు న్యాయవాదులు అభినందించారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాఖ విద్య: మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు కోరారు. సింహాచలంలోని గురుకులంలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల్లో ఇంగ్లీషు మీడియం బోధనలో విద్యనందిస్తున్నామన్నారు. మే 18 వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు. మే 28న ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అప్పన్న చందనోత్సవానికి సర్వం సిద్ధం



- ఆదివారం తెల్లవారుజామున 4గంటల నుంచి సర్వదర్శనాలు
- సాధారణ భక్తులకు పెద్ద పీట
- రాత్రి 7 గంటలకు సింహగిరిపై క్యూ ప్రవేశ గేట్లు మూసివేత
- ప్రొటోకాల్ వీఐపీలకు ఉదయం రెండు స్లాట్లలో దర్శనాలు
- లక్ష యాభైవేల మంది భక్తులు వస్తారని అంచనా



సమాచారం కోసం ఫోన్ నంబర్లు

చందనోత్సవం సమాచారం కోసం సింహగిరిపై సమాచార కేంద్రం నంబర్ 0891-2784949. కొండదిగువ సమాచార కేంద్రం 0891-275666

సింహాచలం : వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని ఏడాదంతా చందనం పూతలో నిత్యరూపంలో దర్శనమిచ్చే సింహాద్రినాథుడి నిజరూప దర్శనం లభించే సమయం ఆసన్నమవుతోంది. ఏడాదిలో కేవలం ఒక్క రోజులోని కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకునేందుకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే సాధారణ భక్తులకే పెద్ద పీట వేస్తూ వారికి దర్శనాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ మల్లికార్జున, సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు సారథ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. 1.50 వేల మంది భక్తులు చందనోత్సవానికి వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది.

ఒంటిగంట నుంచి వైదిక కార్యక్రమాలు

చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేస్తారు. అనంతరం వెండి బొరుగులతో స్వామిపై ఉన్న చందనాన్ని తీసి నిజరూపభరితుడ్ని చేస్తారు. తెల్లవారుజామున 3.30గంటలకు తొలిదర్శనాన్ని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు అందిస్తారు. 3.30గంటల నుంచి 4గంటల వరకు రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ వారిచే సంప్రదాయ వస్త్ర సమర్పణ ఉంటుంది. రాత్రి 8.30గంటల నుంచి సహస్రఘటాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 11గంటల నుంచి శీతలోపచారాలు, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహణ అనంతరం తొలవిడతగా మూడు మణుగుల చందాన్ని స్వామికి సమర్పించి మళ్లీ నిత్యరూపభరితుడ్ని చేస్తారు.

ప్రభుత్వం తరుపున అప్పన్నకు పట్టు వస్త్రాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి , దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు మంజూరు చేసింది.

ఏర్పాట్లు ఇలా...

- తెల్లవారుజామున 4 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుంది. రాత్రి 7గంటలలోపు క్యూలైన్లలోకి భక్తులను అనుమతిస్తారు.
- ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు, తిరిగి ఉదయం 8 నుంచి 10 వరకు రెండు స్లాట్లలో ప్రొటోకాల్ వీవీఐపీలకు దర్శనం కల్పిస్తారు.
- సింహగిరిపైకి కేవలం డ్యూటీ పాస్‌లు ఉన్న వాహనాలను, ప్రొటోకాల్ వీఐపీ వెహికల్ పాస్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- పాత అడవివరం జంక్షన్, గురుకుల పాఠశాల, పాత గోశాల జంక్షన్ వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రతి పార్కింగ్ ప్రదేశంలో చలివేంద్రాలు, లైటింగ్, టెంట్లు, కార్పెట్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.
- శనివారం సాయంత్రం 6 గంటల నుంచి కొండపైకి ప్రవేటు వాహనాలను అనుమతించరు.
- ఆదివారం ఉదయం 3గంటల నుంచి పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్‌ల నుంచి దేవస్థానానికి చెందిన నాలుగు బస్సులతోపాటు, దేవస్థానం అద్దె చెల్లించిన 56 ఆర్టీసీ బస్సుల్లో భక్తులను ఉచితంగా సింహగిరికి చేరుస్తారు. సాయంత్రం 6 గంటలతో బస్సులను నిలిపివేస్తారు. ఖాళీ బస్సులను మాత్రమే కొండపైకి పంపిస్తారు.
- ప్రొటోకాల్, వీవీఐపీ భక్తులు కృష్ణాపురం గోశాల వద్ద వాహనాలు పార్క్‌చేయాలి. దేవస్థానం ఏర్పాటు చేసిన మినీ బస్సుల్లో రెండో ఘాట్ రోడ్డు ద్వారా సింహగిరికి చేరుస్తారు. రూ.1500 టికెట్లపై వచ్చే భక్తుల కోసం అడవివరంలోని రెసిడెన్షియల్ స్కూల్, రూ.1000 టికెట్లపై వచ్చే భక్తులకు రెండో ఘాట్‌రోడ్డు జంక్షన్, పాత గోశాల జంక్షన్, రూ.300 టికెట్లపై వచ్చే భక్తులు శొంఠ్యాం రోడ్డు, న్యూ టోల్‌గేట్ ఏరియా, కొండదిగువ బస్టాండ్, పాత గోశాల జంక్షన్‌ల వద్ద వా హనాలు పార్క్‌చేసి బస్సుల్లో సింహగిరికి చేరుకోవాలి.
- ఈసారి ప్రసాదాల విక్రయాన్ని కొండదిగువకు మార్పు చేశారు.
- శనివారం సాయంత్రం 4గంటల వరకు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి భక్తులను అనుమతిస్తారు. ఆ తర్వాత ఖాళీ బస్సులను కొండపైకి పంపించి కొండపై ఉన్న భక్తులను కొండదిగువకు చేరుస్తారు.
- సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 టికెట్టుపై వచ్చేభక్తులందరికీ ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనాన్ని కల్పిస్తారు.
- చందనోత్సవంనాడు దివ్యాంగులకు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ప్రత్యేక దర్శన సమయం కేటాయించారు.
- ఒకేసారి 27వేల 200మంది భక్తులు వేచిఉండేలా సింహగిరిపై దర్శనాల క్యూలను రూపొందించారు.
- ఉచిత దర్శనం క్యూ, రూ.300 టికెట్టు సింహగిరిపై ఉన్న బస్టాండ్ నుంచి ప్రారంభమవుతాయి. రూ.1000 టికెట్ క్యూ మేఐహెల్ప్ యు కేంద్రం వద్ద నుంచి, రూ.1500 క్యూ పాత పీఆర్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమవుతుంది.
- సుమారు 50వేలమందికి అన్నప్రసాదం అందించే ఏర్పాటు చేశారు.
- భక్తులకు సేవలందించేందుకు 70 వరకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వచ్చాయి.
- సింహగిరిపై పాత విచారణ కార్యాలయం, కొండదిగువ తొలిపావంచా వద్ద పోలీస్ కంట్రోల్ రూమ్స్ అండ్ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ఏర్పాటు చేస్తున్నారు.
- భక్తులకు అత్యవసర పరిస్థితుల్లో బయటకి తీసుకొచ్చేందుకు ఎమెర్జెన్సీ గేట్లు ఏర్పాటు చేస్తున్నారు.
- 264 సీసీ కెమెరాలతో ఏర్పాటుచేస్తున్నారు.
- భక్తులంతా సంప్రదాయ దుస్తుల్లో స్వామివారి దర్శనానికి రావాలని దేవస్థానం విజ్ఞప్తి చేసింది
- పోలీస్, రెవెన్యూ, జీవీఎంసీ, ఎలక్ట్రికల్, మెడికల్, 108, ఫైర్ సర్వీస్, ఏపీఎస్ఆర్టీసీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖల సమన్వయంతో చందనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

- దారెత్తిస్తున్న ఎండలతో పెరిగిన డిమాండ్
- ఈపీడీసీఎల్ పరిధిలో వారం రోజులుగా సరాసరి 91 మిలియన్ యూనిట్ల వినియోగం
- ఏప్రిల్‌లో సరాసరి 75 మిలియన్ యూనిట్లు మాత్రమే..
- గతేడాదితో పోలిస్తే 16 మిలియన్ యూనిట్లకు పైగా అధికం
- డిమాండ్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థ



సాక్షి, విశాఖపట్నం : వేసవి తాపం ఫలితం విద్యుత్ వినియోగంపై స్పష్టంగా కనిపిస్తోంది. ఎండలతో పాటే విద్యుత్ వాడకం కూడా గణనీయంగా పెరిగిపోతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెల ఆది నుంచే మండుటెండలు మొదలవ్వడంతో వేడి నుంచి ఉపశమనం కోసం విద్యుత్ పరికరాలు వినియోగిస్తున్నారు. ఫలితంగా డిమాండ్ విపరీతంగా ఉంటోంది. ఈపీడీసీఎల్ పరిధిలో గత వారం రోజులకు పైగా సరాసరి వినియోగం కంటే రికార్డు స్థాయిలో 15 మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరిగింది. ఉత్పత్తి విరివిగా ఉండటంతో ఎక్కడా కరెంట్ కోతలు లేకుండా డిమాండ్‌కు తగ్గట్లుగా అధికారులు సరఫరా చేస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సాధారణం కంటే 2 డిగ్రీలకు పైగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత పది రోజులుగా సెగలు పుట్టిస్తున్న వేడి కారణంగా విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగిపోయింది. విశాఖ సర్కిల్‌లో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతోంది. భానుడి తాపానికి అల్లాడిపోతున్న ప్రజలు, ఎండ వేడి నుంచి సేద తీరడానికి ఏసీలు, ఫ్రిడ్జ్‌ల వాడకాన్ని మొదలుపెట్టారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది. ఈపీడీసీఎల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో డిమాండ్ పెరిగిపోయింది. గత 8 రోజులు ఈ గణాంకాలు తారస్థాయికి చేరుకున్నాయి.

సరాసరికి 16 మిలియన్ యూనిట్లు అధికంగా...

ఈపీడీసీఎల్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, రాజమండ్రి, ఏలూరు జిల్లాలున్నాయి. వీటిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిల్స్ ఉన్నాయి. ఈ సర్కిల్స్ పరిధిలో ఏప్రిల్ నెలలో గతేడాది లెక్కల ప్రకారం సరాసరి వినియోగం రోజుకు 75 మిలియన్ యూనిట్లు మాత్రమే. కానీ ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతుండటంతో సరాసరి వినియోగం ప్రతి రోజూ 90 మిలియన్ యూనిట్లు దాటిపోతోంది. అంటే రోజుకు 16 మిలియన్ యూనిట్లు అదనంగా వినియోగం జరుగుతోంది. ఈ నెల 17న రికార్డు బెంచ్‌మార్క్ వినియోగాన్ని దాటింది. ఇది ఈపీడీసీఎల్ చరిత్రలో ఏప్రిల్ నెలలో ఇదే అత్యధికం కావడం గమనార్హం.

విశాఖ సర్కిల్‌లో 92.182 మి.యూ.తో రికార్డు

ఈపీడీసీఎల్‌లో ఉన్న అన్ని సర్కిళ్లతో పోలిస్తే విశాఖ సర్కిల్ పరిధిలో గరిష్ట వినియోగం జరుగుతోంది. వినియోగదారుల సంఖ్య కూడా ఊహించని విధంగా అంచనాలను దాటుతోంది. విశాఖ సర్కిల్‌లో 2018 నాటికి 13,38,905 మంది విద్యుత్ వినియోగదారులు ఉండగా, ఆ ఏడాది 30,52,670 కిలోవాట్ల విద్యుత్‌ను వాడుకున్నారు. ప్రస్తుతం వినియోగదారుల సంఖ్య 29 శాతానికి పెరిగితే.. విద్యుత్ వినియోగం 46 శాతానికి పైగా పెరిగింది. ఈ నెల 17వ తేదీన ఈపీడీసీఎల్ పరిధిలో 92.182 మిలియన్ యూనిట్లు కరెంట్ వాడగా.. ఆ ఒక్క రోజు విశాఖపట్నం సర్కిల్ పరిధిలో ఏకంగా 31.522 మిలియన్ యూనిట్లు వినియోగం జరగడం గమనార్హం. విశాఖపట్నం పరిసరాల్లోనే ఎక్కువగా పరిశ్రమలు ఉండడంతో వాటి డిమాండ్‌కు తగిన విద్యుత్‌ను అందించేందుకు ఈపీడీసీఎల్ అధికారులు ఇటీవల కాలంలో గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లు నిర్మించారు. వినియోగంతో పాటు ఆదాయం కూడా పెరగడంతో మౌలిక వసతులకు భారీఎత్తున ఖర్చు చేస్తున్నారు.

విశాఖపట్నం సర్కిల్ పరిధిలో గత వారం రోజులుగా వినియోగం ఇలా..

తేదీ	2023
ఏప్రిల్-14	31.167
ఏప్రిల్-15	31.206
ఏప్రిల్-16	30.792
ఏప్రిల్-17	31.522
ఏప్రిల్-18	31.116
ఏప్రిల్-19	30.903
ఏప్రిల్-20	31.016

వృథా నివారించాలి..



ఎండలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా గరిష్ట స్థాయికి చేరుకుంది. వినియోగం రికార్డు స్థాయిలో జరుగుతున్నా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. ఉష్ణోగ్రతల్లో మార్పులు పరిశీలించి.. వినియోగం పెరుగుతుందని ముందుగానే ఊహించి దానికనుగుణంగా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేశాం. ప్రజలు కూడా కరెంట్ వినియోగంలో పొదుపు పాటిస్తే సరఫరా మరింత నాణ్యంగా అందించగలం. అత్యవసరమైనవి మినహా ఇతర విద్యుత్ ఉపకరణాలను వాడవద్దు. సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు విద్యుత్ వాడకంలో నియంత్రణ పాటించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

– పృథ్వీతేజ్ ఇమ్మడి, ఈపీడీసీఎల్ సీఎండీ

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

విశాఖ విద్య: ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంట్రన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆయా కేంద్రాల్లో 5వ తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎంట్రన్స్ పరీక్ష జరగనుందని గురుకుల ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ రూపవతి చెప్పారు.

రంజాన్ శుభాకాంక్షలు



మేయర్ వెంకట కుమారి

అల్లిపురం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులకు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా అనుగ్రహం ఎల్లవేళలా వారిపై ఉండాలని, సుఖశాంతులతో ఆనందంగా గడపాలని ఆమె ఆకాంక్షించారు. ముస్లింలకు ప్రభుత్వం అండగా ఉంటోందని మేయర్ హరివెంకట కుమారి పేర్కొన్నారు.

విశాఖకు ఉజ్వల భవిత

- రైల్వేస్టేషన్‌లో మరో రెండు ప్లాట్‌ఫాంలు
- వ్యాపార, పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం
- పారిశ్రామికవేత్తలతో ముఖాముఖిలో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సత్పతి

సాక్షి, విశాఖపట్నం: విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, రానున్న కాలంలో మరింత అభివృద్ధి చెందడానికి ఎన్నో వనరులు, అవకాశాలు ఉన్నాయని డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి చెప్పారు. ఆర్థిక, పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో విశాఖకు విశిష్ట స్థానం ఉందన్నారు. విశాఖ అభివృద్ధిలో వాల్తేరు డివిజన్ కీలక పాత్ర పోషిస్తోందని, జోనల్ రైల్వేలో ఇదొక ఆశాకిరణమని పేర్కొన్నారు. పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు అవసరమైన తోడ్పాటును రైల్వే అందజేస్తుందని, దానిని వినియోగించుకుని వ్యాపారాభివృద్ధి చెందాలని కోరారు. శుక్రవారం రాత్రి ఓ హోటల్లో విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (వీసీసీఐ) నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవేత్తల సందేహాలకు సమాధానమిచ్చారు. కొత్తవలస-కిరండోల్ డబ్లింగ్, విజయనగరం-రాయగడ ట్రిప్లింగ్ లైన్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇవి అందుబాటులోకి వస్తే ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సరకు రవాణా వేగం పుంజుకుంటాయన్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో రూ.640 కోట్ల విలువైన మూడు కొత్త ప్రాజెక్టులకు రైల్వే బోర్డు నుంచి అనుమతులు లభించాయని తెలిపారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో అదనంగా రెండు ప్లాట్‌ఫాంలు నిర్మిస్తామని, దువ్వాడ-సింహాచలంల మధ్య రెండు కొత్తలైన్లు ఏర్పాటవుతాయని, పెందుర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. ఇవి అందుబాటులోకి వస్తే రైల్వే సేవల్లో పలు మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. విశాఖకు ఐసీఎఫ్ నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలను 70 శాతం వరకు మార్పు చేశామని తెలిపారు. స్టేషన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా విశాఖ రైల్వే స్టేషన్ వద్ద మల్టీలెవల్ పార్కింగ్ అందుబాటులోకి వస్తుందని, దీంతో పార్కింగ్ సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. తొలుత ఎంటర్‌ప్రెన్యూర్ మ్యాగజైన్‌ను డీఆర్ఎం ఆవిష్కరించారు. సమావేశంలో వీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.సతీష్, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

- టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- గొర్లివానిపాలెంలో రూ.2 కోట్లతో స్టేడియం ప్రారంభం
- ఘనంగా స్వాగతం పలికిన నేతలు



గజమాలతో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

పరవాడ : రాష్ట్రంలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గొర్లివానిపాలెం జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో రూ.2 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. దేశపాత్రునిపాలెం నుంచి గొర్లివానిపాలెం ఇండోర్ స్టేడియం వరకు కార్యకర్తలు వెయ్యి బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పరవాడ ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు వెచ్చించి పూర్తి చేసిందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. యువతీయువకుల జీవితాల్లో వెలుగులు నింపడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. జగనన్న పాలన నచ్చని పచ్చ పార్టీ జగనన్న స్టిక్కర్లను తొలగించే కార్యక్రమాలకు పూనుకొంటుందన్నారు.

ఫార్మాసిటీ కాలనీలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ఫార్మాసిటీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని తెలుసుకున్నారు. వారి అనుమతితో జగనన్న స్టిక్కర్‌ను ఇంటి ముఖద్వారం పై అతికించారు. అనంతరం ఈ.బోనంగిలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, పార్టీ నేతలు బైలపూడి భగవాన్ జయరామ్, కోటాన రాము, గనిరెడ్డి మహాలక్ష్మి నాయుడు, బట్టు సూర్యకుమారి, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వెన్నెల సన్యాసిరావు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

96 అంశాలకు స్థాయీ సంఘం ఆమోదం



స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొన్న మేయర్, సభ్యులు

డాబాగార్డెన్స్: స్థాయీ సంఘ సమావేశంలో రూ.1,395 లక్షల విలువైన ఇంజినీరింగ్ పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన శుక్రవారం స్థాయీ సంఘ సామవేశం నిర్వహించారు. అజెండాలో 97 అంశాలు పొందుపరచగా, వీటిలో 96 అంశాలు ఆమోదం పొందాయని, మిగిలిన ఒక్క అంశం వాయిదా వేసినట్టు మేయర్ తెలిపారు. ఆమోదం పొందిన వాటిలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి దాదాపు రూ.1,395.50 లక్షల పనులు, మెకానికల్ విభాగంలో వాహనాల మరమ్మతులకు రూ.65.76 లక్షలు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రూ.307 లక్షల పనులకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, జోనల్ కమిషనర్లు ఆర్‌జీవీ కృష్ణ, సింహాచలం, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

2,100 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

డొండపర్తి: చందనోత్సవం రోజున వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకోవడానికి లక్ష మందికిపైగా భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 2,100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు కల్పిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. భక్తులకు దర్శన సమయాలు, ఉచిత, కొనుగోలు చేసిన టికెట్ల దర్శనం, బస్సు సౌకర్యాలు, పార్కింగ్ ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగేలా అన్ని ముఖ్యమైన ప్రదేశాల వద్ద ఫ్లెక్సీలతో సూచికలను ఏర్పాటు చేశారు. నకిలీ టికెట్లు, నకిలీ వీఐపీ పాస్‌లను గుర్తించేలా చర్యలు చేపట్టారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోనున్నారు. తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ కోసం, అలాగే ఇతర సమాచారాన్ని అందించడానికి దేవదాయ, పోలీస్, జీవీఎంసీ శాఖాధికారులతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

ఏడు వైద్య బృందాలు సిద్ధం

మహారాణిపేట: చందనోత్సవం సందర్భంగా సింహాచలం కొండ మీద, కొండ దిగువున ఏడు వైద్య బృందాలను సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. కొండ మీద మూడు, కొండ కిందన మూడు, కాలినడక మార్గంలో ఒక బృందం సేవలందిస్తుందని చెప్పారు. ప్రతీ శిబిరంలో ఓ వైద్యుడు, స్టాఫ్ నర్సు, పారా మెడికల్ సిబ్బంది ఉంటారన్నారు. 108 వాహనాలు కూడా సిద్ధంగా ఉంటాయన్నారు.

సౌకర్యంగా అప్పన్న నిజరూప దర్శనం

- సామాన్య భక్తులకు పెద్దపీట
- వీవీఐపీల కోసం 6వేల టికెట్లు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ త్రివిక్రమ్ వర్మ

సింహాచలం: చందనోత్సవంలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వరాహ లక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం కల్పిస్తామని కలెక్టర్ మల్లికార్జున వెల్లడించారు. సింహగిరిపై శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, దేవదాయశాఖ ఫెస్టివల్ అధికారి చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం ఈవో త్రినాథ రావుతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అన్ని క్యూలు నిరంతరాయంగా ప్రారంభమవుతాయని తెలిపారు. గతంలో పోలిస్తే మరింత సౌకర్యవంతంగా భక్తులకు స్వామి దర్శనం అందించే ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సారి వీవీఐపీలు, రూ.1000 టికెట్లు ఉన్న వారికే కాకుండా రూ.300 టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు టైమ్ స్లాట్లు కేటాయించామన్నారు. తద్వారా రద్దీని నియంత్రించడం సాధ్యమవుతుందన్నారు. టైమ్‌స్లాట్‌ను చూసుకుని 30 నిమిషాలు ముందే వస్తే సరిపోతుందన్నారు. వీవీఐపీలు, వీఐపీలు వచ్చినప్పుడు సాధారణ భక్తుల దర్శనం నిరంతరాయంగా జరుగుతుందన్నారు. రూ.1500 వీవీఐపీల టికెట్లు 6 వేలు జారీ చేసినట్లు చెప్పారు. వీరందరికీ అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. జర్నలిస్టులకు కూడా ఈసారి ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు టైమ్ స్లాట్ కేటాయించినట్లు చెప్పారు. సీపీ మాట్లాడుతూ సింహగిరిపై బస్టాండ్, ఆలయ ఉత్తర రాజగోపురం తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీ పాయింట్లను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల సిబ్బందితో కంట్రోల్ కేంద్రం పనిచేస్తుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

చందనోత్సవానికి 160 ప్రత్యేక బస్సులు

డాబాగార్డెన్స్: చందనోత్సవం పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్న నేపథ్యంలో.. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు శుక్రవారం సింహాచలంలో పర్యటించారు. బస్ స్టేషన్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సుమారు 160 బస్సులు గోశాల వరకు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. కొండపై నుంచి గోశాల, అడవివరం వరకు 56 బస్సులు ఉచితంగా నడుపుతున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట డీసీటీఎం జి.సత్యనారాయణ, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ ఉన్నారు.

జెమాలజీలో మనోజ్‌కు డాక్టరేట్



సాక్షి, విశాఖపట్నం: జెమాలజీలో నగరానికి చెందిన ఎస్.మనోజ్‌కుమార్‌కు ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సింగపూర్-షెనాంగ్ రాయల్ కేబియన్ క్రూజ్‌లో ఈ నెల 17 నుంచి నాలుగు రోజుల పాటు ప్రపంచ ఆస్ట్రోలాజికల్ సెనెట్-2023 జరిగింది. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన జెమాలజిస్టులు, జ్యోతిష్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో జెమాలజీ పరిశోధన చేసిన మనోజ్‌కుమార్‌కు ఫెడరేషన్ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది.

టికెట్ల కోటా తగ్గింపుతో నిరాశ

సింహాచలం: చందనోత్సవంలో దేవస్థానం ఉద్యోగులకు టికెట్ల కోటా తగ్గించడంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగులకు పూర్తిగా టికెట్లు ఇవ్వకపోవడంతో తీవ్ర నిరాశతో ఉన్నారు. ఏటా చందనోత్సవానికి దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులకు ఒక్కొక్కరికి ఐదు టికెట్లు(రూ.200), రిటైర్డ్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు టికెట్లు ఇచ్చేవారు. వారంతా నగదు చెల్లించే టికెట్లు తీసుకునేవారు. ఈసారి దేవస్థానం ఉద్యోగులకు నాలుగు , రిటైర్డ్ ఉద్యోగులకు అసలు టికెట్లు జారీ ఉండదని నిర్ణయం తీసుకోవడంతో వారంతా నిరాశ చెందుతున్నారు. ఈ తరుణంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం సింహగిరికి వచ్చి కలెక్టర్ మల్లికార్జునను కలిశారు. ఈ సారి రిటైర్డ్ ఉద్యోగులకు టికెట్లు లేవని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.

పుడమిని పూజిద్దాం

నేడు ధరిత్రీ దినోత్సవం





పుడమి రక్షణపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు

విశాఖ విద్య: పుడమి తల్లికి కోపమొస్తే ప్రళయం వస్తుంది. ప్రకృతిని ప్రేమించి చెట్లు పెంచితే ప్రాణం పోస్తుంది. నేలతల్లి బాగుంటేనే ఆ తల్లి బిడ్డలమైన మనం బాగుంటాం. మన భారాన్ని మోసే భూమాతను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత సమస్త జీవకోటిపై ఉంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాయి. పుడమి తల్లిని పరిరక్షించుకోవాలన్న బాధ్యతను గుర్తు చేస్తూ ఏటా ఏప్రిల్ 22న ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'మొక్కలపై పెట్టుబడి పెట్టండి' అనే నినాదంతో పెద్ద ఎత్తున కార్యక్రమాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు సమాయత్తమయ్యాయి.

జీవరాశుల రక్షణకు 'గ్రీన్ క్లైమేట్'

నగరంలోని గ్రీన్ క్లైమేట్ సంస్థ పర్యావరణ పరిరక్షణ, జీవరాశిని కాపాడడానికి కృషి చేస్తోంది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, సైన్స్ టీచర్లు, జిల్లా సైన్స్ కాంగ్రెస్ అధికారులు, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలను భాగస్వాములను చేసి ప్రతి రోజూ కనీసం 200 మంది విద్యార్థులతో వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రీన్ సోల్జర్స్, గ్రీన్ లీడర్స్, గ్రీన్ వలంటీర్స్, గ్రీన్ కల్చరల్ టీమ్స్ సభ్యులు ప్రతీ ఆదివారం వీకెండ్ గ్రీన్ అనే పేరుతో 100 మొక్కలు నాటుతున్నారు. అడవుల విస్తరణ కోసం రెండు కోట్ల విత్తన బంతులను విద్యార్థుల చేత తయారు చేయించి.. కొండల మీద వేశారు. 'పుడమిని రక్షించుకునేందుకు మొక్కలను నాటుదాం. పక్షుల కోసం గూళ్లను నిర్మిద్దాం. కారు, బైక్‌ల్లో ప్రయాణాలు తగ్గించి..సైకిల్ మీద ప్రయాణం చేద్దాం. భూమిని గౌరవించడానికి ప్రతిజ్ఞ బూనుదాం. సహజ వనరులు, అటవీ సంపదని కాపాడుకోవడానికి కంకణం కడదాం. విద్య పురోగతికి పునాది. భూ గ్రహానికి కలిగే వాతావరణ మార్పుల విషయంపై సమాజంలో ప్రతి ఒక్కరికీ పరిజ్ఞానం కల్పిద్దాం.' అని ఈ సందర్భంగా పర్యావరణవేత్తలు పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

తల్లిలాంటి భూమాతను కాపాడుకునేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. తెలుగు రాష్ట్రాల్లోని ఐదు వేల విద్యాసంస్థల ద్వారా సుమారు 25 లక్షల మంది విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం.

– జె.వి. రత్నం, గ్రీన్ క్లైమేట్ నిర్వాహకులు, విశాఖ పట్నం

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పర్యావరణం బాగుంటేనే మనం బాగుంటాం. భూమిని కాపాడుకుంటే, అది మనల్ని కాపాడుతుంది. అందుకనే పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను పూర్తి స్థాయిలో భాగస్వామ్యులను చేసేలా పాఠశాల విద్యాశాఖ ద్వారా కార్యక్రమాలను చేపడుతున్నాం. సైన్సు సంబంధిత ప్రయోగాల్లోనే ఇటువంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నాం

– కప్పల ప్రసాద్, సైన్సు అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

మరో 17 కొత్త మెడికల్ కళాశాలల స్థాపనకు సిద్ధం

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కోరుకొండ బాబ్జీ



బెస్ట్ అవుట్ గోయింగ్ డాక్టర్ అనన్యకు పట్టా అందిస్తున్న వీసీ బాబ్జీ

తగరపువలస (భీమిలి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని.. అందులో భాగంగా త్వరలో కొత్తగా 17 కొత్త మెడికల్ కళాశాలల స్థాపనకు సిద్ధంగా ఉన్నారని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కోరుకొండ బాబ్జీ అన్నారు. సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో శుక్రవారం జరిగిన గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని.. 2017–18 విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటులో వైద్యసేవలు, పీజీ సీట్లు, రీసెర్చ్ వసతులు, ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. విద్యార్థులు ఇక్కడితో ఆగిపోకుండా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యను అభ్యసించడంతో పాటు సివిల్ సర్వీస్‌ల వైపు దృష్టి సారించి దేశాభివృద్ధికి సహాయపడాలన్నారు. దేశంలోనే అందమైన విశాఖ నగరంలో తాను కూడా వైద్య విద్యను అభ్యసించినందుకు గర్వంగా ఉందన్నారు. యాజమాన్య ప్రతినిధి విశ్రాంత ఐపీఎస్ ఎన్.రవీంద్రకుమార్ రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ బ్యాచ్‌లో ఉత్తర అవుట్ గోయింగ్ వైద్యురాలిగా ప్రతిభ చూపిన ఏలేశ్వరానికి చెందిన డాక్టర్ అనన్యకు ఆరు ఉత్తమ ప్రతిభ పతకాలు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాధా మాధవ్ త్రిపాఠి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సీఈవో కె.నిరంజన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీధర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ ఎ.కృష్ణమూర్తి శాస్త్రి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ బీవీఎస్ రత్నకుమారి, ప్రిన్సిపాల్ కాల్వ శ్రీరామకృష్ణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీభా ఫ్రాన్సిస్, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కీబోర్డు హార్డ్.. ఉద్యోగావకాశాలు కోల్పోయాం'



షీలానగర్ అయాన్ డిజిటల్ జోన్ వద్ద ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

అక్కిరెడ్డిపాలెం: తమకు హార్డ్‌గా ఉన్న కంప్యూటర్ కీ బోర్డులను కేటాయించారని, దీంతో టైపింగ్ చేయలేక ఉద్యోగ అవకాశాలు కోల్పోయామంటూ సుమారు 150 మందికి పైగా అభ్యర్థులు ఆందోళనకు దిగారు. వివరాలివీ.. ఏపీ హైకోర్టు అమరావతి నిర్వహించిన టైపిస్టులు, కాపీ ఇస్ట్ కంప్యూటర్ పరీక్షలు తిరుపతి, రాజమండ్రి, కర్నూల్, విజయవాడ, విశాఖపట్నంలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం షీలానగర్ అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమకు కేటాయించిన కంప్యూటర్ కీ బోర్డులు హార్డ్‌గా ఉన్నాయంటూ బయటకు వచ్చేశారు. సుమారుగా 150 మంది అభ్యర్థులు బయటకు వచ్చి నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్వాహకులు సైతం కీ బోర్డులు హార్డ్‌గా ఉన్నాయని, కానీ తాము పరీక్షలు నిర్వాహకులు మాత్రమే అంటూ తేల్చేశారు. కీ బోర్డులు హార్డ్‌గా ఉన్న అంశాన్ని ఈ సమయంలో పరీక్ష కేంద్రంలో ఉన్న సంబంధిత అధికారుల దృష్టిలో పెట్టామని, దీనిపై సమాధానం ఇవ్వకుండా వారు అక్కడ నుంచి వెళ్లిపోయారని నిర్వాహకులు తెలిపారు. దీంతో అభ్యర్థులు డిజిటల్ జోన్ ఆవరణలో ఆందోళనకు దిగారు. ఆందోళనకు ఎమ్మార్పీఎస్ నాయకుడు మద్దతు ఇచ్చారు. సంఘటనా స్థలానికి గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు, ఎస్ఐ కొల్లి సతీష్ చేరుకుని విషయం తెలుసుకున్నారు. పరీక్ష నిర్వాహకులతో మాట్లాడారు. అభ్యర్థులు ఈ అంశాన్ని రాద్ధాంతం చేయవద్దని.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మహారాణిపేట: డెంగ్యూ, మలేరియా వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాలు పురస్కరించుకుని సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నీటి ట్యాంకులకు తప్పనిసరిగా మూతలు ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక బృందాలు, విద్యార్థులకు దోమల నియంత్రణ పద్ధతులపై చైతన్యం కలిగించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పబ్లిక్ సెక్టార్ సంస్థల్లో ఎప్పటికప్పుడు దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రై డేలో శానిటరీ సెక్రటరీ, ఏమినిటీ సెక్రటరీలను భాగస్వామ్యులు చేయాలని, వ్యాధి తీవ్ర అధికంగా ఉంటే అన్ని రకాల పిచికారీ కార్యక్రమాలను నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు సూచించారు. ఈ నెల 25న మలేరియా దినోత్సవం సందర్భంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలో దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి వై.మణి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ రమణమూర్తి, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

'డిప్యూటీ డీఈవో తీరు అభ్యంతరకరం'

అతనితో వాగ్వాదానికి దిగిన విద్యా శాఖ ఉద్యోగి భర్త

విశాఖ విద్య: పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనం జరుగుతున్న క్వీన్ మేరీ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్‌తో విద్యాశాఖకు సంబంధం లేని ఓ ఉద్యోగి వాగ్వాదానికి దిగారు. విద్యా శాఖలో పనిచేస్తున్న తన భార్యతో డిప్యూటీ డీఈవో సెల్‌ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడారని, వాయిస్ రికార్డ్ తమ వద్ద ఉందన్నారు. వైద్య పరమైన కారణాలతో మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇచ్చిన డిప్యూటీ డీఈవో, తిరిగి స్పాట్‌కు రమ్మనడంలో అర్థమేంటని ప్రశ్నించారు. మహిళా ఉద్యోగితో ఇలానే వ్యవహరిస్తారా.? అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి వద్ద కూడా తన భార్య గురించి ఇష్టానుసారంగా మాట్లాడారని, ఆ అధికారే వాయిస్ రికార్డు తనకు పెట్టారని చెప్పుకొచ్చారు. డిప్యూటీ డీఈవోపై ఉన్నతాధికారులతో పాటు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దీంతో అక్కడ ఉన్న ఉపాధ్యాయులు అతనికి సర్దిచెప్పారు.

మూల్యాంకన కేంద్రంలోనే ఈ ఘటన చోటుచేసుకోవటంతో అంతా అవాక్కయ్యారు. విషయం తెలుసుకున్న డీఈవో ఎల్.చంద్రకళ అక్కడకు చేరుకుని ఆ ఉద్యోగితో చర్చించి, సముదాయించారు.

23న శశిలో ఐఐటీ, నీట్‌పై అవగాహన

తగరపువలస: 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సంగివలస శశి విద్యాసంస్థల్లో ఈ నెల 23న ఐఐటీ, నీట్‌పై అవగాహన కలిగిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షలపై సందేహాలను తీరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ తెలిపారు. మరిన్ని వివరాలకు 97059 25599, 97056 35599 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో మహిళకు బెదిరింపులు

అల్లిపురం: ఓ మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసి.. ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన వట్టికూటి మణిశర్మ అవివాహిత మహిళ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి డీపీని డౌన్‌లోడ్ చేశాడు. దానిని న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి ఆ ఫొటోలపై అసభ్యకరంగా టైపు చేశాడు. వాటిని బాధితురాలికి పంపించి డబ్బులు పంపించాలని, లేకపోతే అందరికీ ఈ ఫొటోలు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో ఆమె సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్ సాంకేతిక సహాయంతో దర్యాప్తు జరిపి.. వట్టికూటి మణిశర్మగా గుర్తించారు. నిందితుడు కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చదివాడు. టెక్నాలజీపై ఉన్న అవగాహనతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ క్రియేట్ చేసి నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సైబర్ క్రైం బాధితులు www.cybercrime.gov.in లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930, 94906 17917కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అన్నసమారాధన భవనం నేడు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా అన్నసమారాధన భవనం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన అన్న సమారాధన భవంతిని శనివారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు, దాతల సాయంతో సుమారు రూ.2.50 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. దీనికి అలివేలుమంగ అన్నసమారాధన భవంతిగా నామకరణం చేశారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో కుకింగ్, స్టోర్ రూమ్ ఉంటుంది. మొదటి అంతస్తులో ఒకేసారి 160 మంది భోజనాలు చేసే విధంగా నిర్మాణం చేపట్టారు. రెండో అంతస్తును ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంలో సామూహిక భోజనశాలగా ఉపయోగిస్తారు. మూడో అంతస్తులో పీఠాధిపతులు, అర్చకులు ఉండేందుకు, ముఖ్యమైన ఆధ్యాత్మిక సమావేశాలు నిర్వహిస్తారు. డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కె.సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, త్రిదండి చినజీయర్ స్వామి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఆలయ వర్గాలు తెలిపాయి.